సాక్షి రంగారెడ్డి

గురువారం, 1, ఆగస్టు, 2024



తల్లిపాలే.. శ్రీరామరక్ష

ఇంటికి దీపం ఇల్లాలయితే, ఆ దీపం ప్రసరించే వెలుగురేఖలు సంతానం. ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు కాంతులీనుతుంది. 8లో▸



డ్రగ్స్ విషం కంటే ప్రమాదం

డ్రగ్స్ విషం కంటే ప్రమాదకరం. వాడితే జీవితాలు నాశనం అవుతాయని యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ హెచ్చరించారు. 8లో▸



కార్గో సేవలను ఆదరించాలి

ఆర్టీసీ కార్గో సేవలను వ్యాపారులు, ప్రజలు వినియోగించుకోవాలని ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్ కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

మాజీ సీఎం జగన్‌ను కలిసిన అల్లం



జగన్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తెలంగాణ ఉప సర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం విజయవాడలో కలిశారు. పుష్పగుచ్ఛం, శాలువాతో జగన్‌ను సన్మానించారు.

మెరబ్‌కు సీఎం అభినందన



సీఎంకు మొక్క అందజేస్తున్న మెరబ్

మొయినాబాద్: ఐక్యరాజ్య సమితి యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపికైన మెరల్ మెరబ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్ నుంచి పది మందికి అవకాశం రాగా.. తెలంగాణ నుంచి మెరబ్ సెలక్ట్ అయ్యారు. ఈమె తండ్రి వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన కృపావరం.. కొన్నేళ్లుగా మొయినాబాద్‌లోని చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. మెరబ్ ఘట్‌కేసర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో గతేడాది డిగ్రీ పూర్తి చేసింది. 2023లో నిర్వహించిన పరీక్షకు హాజరై.. ప్రస్తుతం జరిగే ఐరాస యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపికైంది. ఆగస్టు 2 నుంచి 5 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే కాన్ఫరెన్స్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతోంది.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చల్లా

కందుకూరు: మీర్‌ఖాన్‌పేటలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నెట్ జీరో సిటీలో కొనసాగుతున్న సభ ఏర్పాట్లను బుధవారం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి, ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, ఎస్.పాండు, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.మదన్‌పాల్‌రెడ్డి, కె.వెంకటేశ్, ఢిల్లీ కృష్ణ, జి.దర్శన్, ఈ.శ్రీకాంత్‌రెడ్డి, ఎ.జగదీశ్, జి.యదయ్య, దేవేందర్, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ నంబర్.. క్యూఆర్ కోడ్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్‌కు జీఐఎస్ మ్యాపింగ్ సర్వేతో పాటు దానికి అనుబంధంగా డిజిటల్ డోర్ నంబర్ల ప్రక్రియ కూడా జరుగుతున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. జీఐఎస్ సర్వే ద్వారా అన్ని ఆస్తుల జియో ట్యాగింగ్ పూర్తయ్యాక అన్ని ఇళ్లకూ ప్రత్యేక క్రమసంఖ్యతో డిజిటల్ డోర్ నంబర్ జారీ అవుతుందని తెలిపారు. దానికి సంబంధించిన క్యూఆర్ కోడ్ ప్లేట్లను ఇళ్ల బయట తలుపులకు బిగించనున్నట్లు పేర్కొన్నారు. సాంకేతికత ఆధారంగా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్ని తట్టుకునేలా వాటిని తయారు చేయించనున్నట్లు తెలిపారు. తద్వారా ఈ-గవర్నెన్స్‌కు యాక్సెస్ సులభం కావడంతోపాటు అత్యవసర సమయాల్లో ప్రజలకు తగిన సహాయం అందించేందుకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. అన్ని పబ్లిక్ యుటిలిటీస్‌ను ఒక ఐడీకి కనెక్ట్ చేయడం ద్వారా అన్ని విభాగాల మధ్య మంచి కమ్యూనికేషన్ ఉంటుందని తెలిపారు. మెరుగైన పట్టణ నిర్వహణ, ప్రజా సదుపాయాల కోసం జరుగుతున్న జీఐఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సేకరించరు అని పేర్కొన్నారు. ప్రజల గోప్యత, భద్రతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు.



నెట్‌జీరో సిటీకి ప్రతిపాదించిన భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం (ఫైల్)



విశ్వనగరి 4

ఫార్మా భూముల్లో ‘ఫ్యూచర్ సిటీ’

- తూర్పు దిశగా మరో మహానగర నిర్మాణానికి సర్కారు సిద్ధం
- నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయం
- న్యూయార్క్ తరహాలో అభివృద్ధికి ప్రణాళిక
- నేడు స్కిల్ వర్సిటీకి సీఎం శంకుస్థాపన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విశ్వనగరి మరింత విస్తరిస్తోంది. తూర్పు దిశగా మరో నగర నిర్మాణం దిశగా ప్రభుత్వం పునాదులు వేస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థల తాకిడితో ఈ నగర విస్తరణకు ప్రణాళిక రచిస్తోంది. ఇప్పటికే ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీల తరహాలో మరో నగర ఏర్పాటుకు అంకురార్పణ చేస్తోంది. ఔషధనగరి విస్తరణ స్థానే కాలుష్య రహిత మహానగరి నిర్మాణానికి గురువారం ప్రభుత్వం తొలి అడుగు వేయనుంది. యువతకు ఉపాధి కల్పన కోసం కాలుష్య రహిత పరిశ్రమలను నెలకొల్పనుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఈ ప్రాంతానికి వన్నె తేవాలని నిర్ణయించింది. విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, విశాలమైన రోడ్లు, ఆస్పత్రులు, మెట్రో రైలు రవాణా తదితర మౌలిక సౌకర్యాలు కల్పించనుంది.

ఫార్మాసిటీ.. ఇక నెట్ జీరో సిటీ

ఫార్మాసిటీ ఏర్పాటుకు యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లో 19,333 ఎకరాలను సేకరించాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో 14,500 ఎకరాలు సేకరించింది. భాగ్యనగరానికి చేరువలో పెద్ద ఎత్తున ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు నెలకొల్పితే పర్యావరణం కలుషితమవుతుందనే ఆందోళన వ్యక్తమైంది. అయినప్పటికీ, నాటి సర్కార్ వెనుకడుగు వేయలేదు. ఇదిలా ఉండగా తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిందే తడవుగా ఫార్మా ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్కడే ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే ఫార్మా సిటీ భూముల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కర్బన ఉద్గారాలు, ఇతర గ్రీన్‌హౌస్ వాయువులను పీల్చుకుని, మానవాళికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇచ్చే వృక్ష సంపదను పెంచి, ఈ ప్రాంతాన్ని నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో న్యూయార్క్ తరహాలో దీన్ని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించింది.

మహేశ్వరానికి మహర్దశ

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రూ.225 కోట్లతో 10.5 కిలోమీటర్ల మేర ఆరులేన్ల రహదారి నిర్మాణం పూర్తి చేశారు. అమెజాన్ డేటా సెంటర్‌కు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, భవిష్యత్తు భారీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే ఇక్కడ 765 పవర్ గ్రిడ్ సహా వంద ఎకరాల్లో 400 కేవీ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 112లో మహేశ్వరం వైద్య కళాశాలకు ఇప్పటికే 20 ఎకరాలు కేటాయించింది. రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ, రూ.400 కోట్లతో ఆస్పత్రి భవనం ఏర్పాటుకు గత ఏడాదే శంకుస్థాపన చేశారు. కొంగరలో ఫాక్స్‌కాన్ కంపెనీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే కార్యకలాపాలు మొదలు కానున్నాయి. కొంగర రావిరాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 200 అడుగుల విస్తీర్ణంలో రహదారి విస్తరణతో పాటు ఎయిర్‌పోర్టు నుంచి తుక్కుగూడ, ఫాక్స్‌కాన్ మీదుగా ప్రతిపాదిత నెట్‌జీరో సిటీకి మెట్రోలైన్ సేవలను అందుబాటులోకి తేనున్నారు. ఈ ప్రాంతంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, 200 ఎకరాల్లో ఏఐ(కృత్రిమ మేధ) సిటీ, 200 ఎకరాల్లో గోల్ఫ్‌కోర్సుకు సీఎం సూత్రప్రాయంగా అంగీకరించారు.

57 ఎకరాల్లో వర్సిటీ

పరిశ్రమలు, ఐటీ, అనుబంధ రంగాల ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సర్వే నంబర్ 112లో 57 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఫార్మా, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, రిటైల్, ఈ కామర్స్, లాజిస్టిక్, ప్యాకింగ్, హార్డ్‌వేర్, ఎలక్ట్రీషన్ వంటి 17 రంగాలలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్, మూడేళ్ల డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టనుంది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కోర్సులను నిర్వహించనుంది. ఏటా 20 వేల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ‘యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ బిల్లు–2024’ను కూడా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గవర్నర్/ సీఎం ఈ వర్సిటీకి ఛాన్సలర్‌గా వ్యవహరించనున్నారు. ఒక వీసీ సహా 15 మందితో పాలక మండలి ఉంటుంది. ఇందులో ఏడుగురు సభ్యులు పరిశ్రమలకు చెందిన వారే ఉంటారు. వర్సిటీ మూడేళ్ల నిర్వహణకు రూ.312 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేసింది. రూ.170 కోట్లు కేవలం కోర్సుల ఫీజుల రూపంలో సమకూరనుంది. మీర్‌ఖాన్‌పేట్‌లో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోతున్న నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయం, రోడ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు సీఎం రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు.

ఆరోగ్యాన్ని చెరబట్టి!

- ఓవైపు రసాయన ఫ్యాక్టరీలు.. మరో వైపు లెడ్ బట్టీలు
- కాలుష్యపు కోరల్లో గ్రామాలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నందిగామ: పచ్చని పంట పొలాలు, గ్రామాల్లో కోరలు చాస్తున్న కాలుష్యం.. చుట్టూ ఉన్న రసాయనిక పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఓ వైపు పరిశ్రమలు, మరోవైపు భగభగ మండే లెడ్ బట్టీలతో పీల్చే గాలి, తాగే నీరు ప్రమాదకరంగా మారి.. సగటు మనిషి జీవితాన్ని దహించి వేస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టుకొస్తున్న లెడ్ బట్టీలను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

- మండల కేంద్రమైన నందిగామ గ్రామ పంచాయతీ పరిధి జంగోనిగూడ లెడ్ బట్టీలకు చిరునామాగా మారింది.
- జంగోనిగూడ నుంచి తీగాపూర్‌కు వెళ్లే రహదారిలో మూడు బట్టీలు కొనసాగుతున్నాయి.
- పిత్తి ల్యామినేషన్ ఫ్యాక్టరీ సమీపంలో ఓ చోట లెడ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు.
- నందిగామ నుంచి చేగూరుకు వెళ్లే నక్షబాట వెంచర్ సమీపాన కొంత కాలంగా బట్టీలు కొనసాగుతున్నాయి.
- అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోని పారిశ్రామిక వాడలో పదుల సంఖ్యలో బట్టీలు నడిపిస్తున్నారు.

కార్మికుల రక్షణ గాలికే..

బట్టీల నిర్వాహకులు రాత్రి తొమ్మిది గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకే పని చేయిస్తుంటారు. ఈ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి రక్షణ పరికరాలు ఉండవు. సౌకర్యాలు అసలే లేవు. జంగోనిగూడ శివారు లెడ్ బట్టీలో గతంలో చోటుచేసుకున్న ప్రమాదంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. అనేక ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ.. గుట్టుచప్పుడు కాకుండా క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి, అనుమతి లేని లెడ్ బట్టీలపై చర్యలు తీసుకోవాలని పరిసరప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పొగ చుట్టేస్తోంది



గ్రామ శివార్లలో కొనసాగుతున్న లెడ్ బట్టీలతో కాలుష్యం బారిన పడుతున్నాం. రాత్రి 10 గంటల దాటిందంటే చాలు గ్రామాన్ని నల్లటి పొగ చుట్టేస్తుంది. దీంతో శ్వాస తీసుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. పొగతో పాటు దుర్వాసన వస్తోంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– బంటారం లక్ష్మణ్ గౌడ్, నర్సప్పగూడ



బ్యాటరీలను పగులగొట్టి

పర్మిషన్ లేకుండా కేవలం రాత్రి వేళల్లోనే బట్టీలు పనిచేస్తున్నాయి. తొలుత పాడైన బ్యాటరీలను పగులగొట్టి అందులోని మెటీరియల్‌ను సేకరిస్తారు. అనంతరం వాటిని బొగ్గుతో కాల్చి కరగబెట్టి లెడ్‌ను వెలికి తీస్తారు. ఈ ప్రక్రియలో నల్లటి పొగ దట్టంగా వ్యాపిస్తుంది. దీంతో పాటే దుర్వాసన వస్తుంది. ఈ పొగ సమీప గ్రామాలు, వ్యవసాయ పొలాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.



జంగోనిగూడ శివారు లెడ్ బట్టీలో రాత్రి వేళ కొనసాగుతున్న పనులు

పంచాయతీల విలీనం

- నేడు కేబినెట్ ఆమోదం
- అనంతరం అసెంబ్లీలో బిల్లు..



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీపంలోని మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్ల పరిధిలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలా విలీనం చేసిన అనంతరం ఆ మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్న నిర్ణయంతో ఉంది. అందులో భాగంగా ఇప్పటికే పాలకవర్గాల పదవీ కాలం పూర్తయిన పంచాయతీలను తక్షణమే విలీనం చేయాలని, పురపాలక సంఘాల పదవీ కాలం పూర్తయ్యాక వాటిని విలీనం చేయనుంది. పదవీ కాలం పూర్తయిన పంచాయతీలను డీనోటిఫై చేసి.. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల జాబితాను పంపాలని నగర శివారు జిల్లాల కలెక్టర్లను ఆయన ఆదేశించారు. జీహెచ్‌ఎంసీలో విలీనయ్యే పంచాయతీలతో పాటు.. ఔటర్ వెలుపల మున్సిపాలిటీలకు దగ్గర ఉన్న వాటిని ఆయా మున్సిపాలిటీల్లో కలపడం లేదా కొన్ని పంచాయతీలను ఒక క్లస్టర్‌గా విభజించి కొత్త మున్సిపాలిటీలుగా చేసేలా ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనలపై గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి.. శుక్రవారం ముగిసే శాసనసభ సమావేశాల్లో బిల్లు రూపంలో సభ ముందుకు తేవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు ఔటర్‌కు సమీపంలో ఉన్న పంచాయతీల జాబితాలను ప్రభుత్వానికి పంపారు. రంగారెడ్డి జిల్లాలో పది జీపీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తుండగా.. మేడ్చల్ జిల్లాలో 23 గ్రామాలను వాటికి దగ్గరలో ఉన్న పురపాలికల్లో కలుపనున్నారు. ఔటర్‌కు వెలుపల అత్యంత చేరువలో ఉన్న జీపీలను కూడా పురపాలనలో విలీనం చేసే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది.

మున్సిపాలిటీ	విలీనమయ్యే పంచాయతీలు
పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారామతిపేట, గౌరెల్లి, బాచారం
శంషాబాద్	రషీద్‌గూడ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ
శంకర్‌పల్లి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ
ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనాపూర్,
నాగారం	కీసర, రాంపల్లి దాయర, యాద్గార్‌పల్లి, చీర్యాల
తూంకుంట	బాబాగూడ, బొమ్మరాసిపేట, శామీర్‌పేట
మేడ్చల్	రాయిలాపూర్, పూడూరు
గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
దమ్మాయిగూడ	తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, కరీంగూడ, గోధుమకుంట
పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, ప్రతాపసింగారం, కొర్రెముల

నగరంలో ‘ప్రజా పాలన’ సేవా కేంద్రాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు నగరంలో ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎంసీ ఒక ప్రకటనలో తెలిపింది. అర్హులైన అభ్యర్థులు తమ సమీపంలోని ప్రజాపాలన సేవా కేంద్రాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. సంబంధిత సర్కిళ్లలోని సర్కిల్ కార్యాలయాలు/వార్డు కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. పూర్తి వివరాలకు జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

జీహెచ్‌ఎంసీని సందర్శించిన యూపీ మేయర్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న వరద నివారణ, నిర్వహణ పద్ధతుల్ని అధ్యయనం చేసేందుకు బుధవారం నగరానికి వచ్చిన యూపీలోని గోరఖ్‌పూర్, కాన్పూర్, లక్నో, అయోధ్య మేయర్లు మంగ్లేష్ కుమార్ శ్రీవాత్సవ, ప్రమీల పాండే, సుష్మా ఖరక్‌వాల్, గిరీష్ పాటి త్రిపాఠిలు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతలను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్షాల సమయంలో గ్రేటర్ లోని 150 డివిజన్లలోని పరిస్థితుల్ని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తూ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని మేయర్ వారికి వివరించారు. ఎస్‌ఎన్‌డీపీ కింద చేపట్టిన పనులు, డీఆర్‌ఎఫ్ చేస్తున్న పనులను గురించి ఎస్‌ఎన్‌డీపీ సీఈ కోటేశ్వరరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వారికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గురువారం మేయర్ల బృందం ఎల్‌బీనగర్ జోన్‌లో ఎస్‌ఎన్‌డీపీ కింద చేసిన నాలాల అభివృద్ధి పనుల్ని చూడనుంది.

ఫుడ్ కోర్టులో మద్యం పట్టివేత

శంకర్‌పల్లి: ఫుడ్ కోర్టులో మద్యం అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల గ్రామంలోని కేకే ఫుడ్ కోర్టులో మోకిల తండాకి చెందిన రాజు(35), ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ కుమార్(42)లు మద్యం అమ్ముతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకి వెళ్లి తనిఖీలు చేయగా సుమారు రూ.30 వేల విలువ చేసే 56 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రగ్స్ విషం కంటే ప్రమాదకరం

అదనపు డీజీపీ సందీప్ శాండిల్య

శంకర్‌పల్లి: డ్రగ్స్ విషం కంటే ప్రమాదకరమైనవని, అవి వాడితే జీవితాలే నాశనం అవుతాయని రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్, అదనపు డీజీపీ సందీప్ శాండిల్య హెచ్చరించారు. బుధవారం శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామ సమీపంలోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ అనేది ఒక మహమ్మారని, ఒకసారి అలవాటు పడితే వదలడం కష్టమన్నారు. యువత, విద్యార్థులు దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, దాని వల్ల వచ్చే అనార్థాల గురించి వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరైనా డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు చేసి వాడినా అత్యంత కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ వాడడం వల్ల యువత తమ స్టడీ, కెరీర్, లైఫ్, ఫ్యామిలీ రిలేషన్స్ చెడి పోతాయని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ ధర్మారెడ్డి, సీఐ గోపి, మోకిల సీఐ వీరబాబు, ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ వాడమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు డీజీపీ సందీప్ శాండిల్యా

తేలని ట్యాక్సీ డ్రైవర్ల పంచాయితీ

శంషాబాద్: ఎయిర్‌పోర్టులో ట్యాక్సీ డ్రైవర్ల పంచాయితీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలు ఓలా, ఉబర్ సంస్థలు ప్రోత్సహిస్తుండడంతో తమ ఉపాధి కోల్పోతున్నా మని రెండోరోజు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ట్యాక్సీ లు పూర్తి స్థాయిలో నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉన్నా రవాణశాఖ అధికారు లు, సైబరాబాద్ పోలీసులు, జీఎంఆర్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఆర్‌టీఏ, సైబరాబాద్ పోలీసులు, జీఎంఆర్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గిగ్‌ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సలావుద్దీన్ డిమాండ్ చేశారు.

తల్లిపాలే.. శ్రీరామరక్ష



మాతృత్వ స్పర్శకు ప్రతి మహిళ పరితపిస్తుంది. పుట్టిన బిడ్డ ప్రేమను ఆస్వాదించాలని ఆరాటపడుతుంది. ఆ సమయంలో తల్లిపాలు పసికందుకు సంజీవనిలా పని చేస్తుందని అనేకసార్లు వైద్య నిపుణులు నొక్కి చెప్పారు.

పుట్టిన గంటకే ఇచ్చే ముర్రుపాలతో శిశువుకు బలం

- అమ్మ పాలు ఆరోగ్యానికి మేలు
- ఆగస్టు 1 నుంచి 7వరకు తల్లి పాల వారోత్సవాలు

షాబాద్: ఇంటికి దీపం ఇల్లాలయితే, ఆ దీపం ప్రసరించే వెలుగురేఖలు సంతానం. తల్లీ పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే ఆ ఇల్లు కాంతులీనుతుంది. తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అమ్మపాల ప్రాధాన్యం గురించి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు.

ముర్రుపాలు అమృతం

నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు దోహదపడతాయి. సహజ సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయి. తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయి. అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయి. తల్లిపాలు ముఖ్యంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే అపోహలు వీడి తప్పకుండా బిడ్డకు పాలు పట్టించాలని చిన్న పిల్లల వైద్యనిపుణులు బాలింతలకు సూచనలు చేస్తున్నారు. పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు అందించే ముర్రుపాలు సహజ రోగనిరోధక శక్తి కలిగేలా చేస్తాయి. అందుకే తల్లిపాలను అమృతంతో పోలుస్తారు. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

అపోహలు వీడాలి

సమాజంలో తల్లిపాలపై ఉన్న అపోహలు వీడాలి. పాశ్చాత్య దేశాల్లో బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో పరోక్షంగా తల్లి శారీరక సౌందర్యం దెబ్బతింటుందని, మహిళల అందం తగుతుందనే అపోహలున్నాయి. సహజ సిద్ధంగా ఉత్పత్తి అయ్యే తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తుంది. డబ్బా పాలతో బిడ్డ ఆరోగ్యంగా ఎదిగినా మానసికంగా మెరుగైన ఎదుగుదల ఉండదని వైద్యులు చెబుతున్నారు.

పాలిచ్చే సమయంలో..

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. ఇలా ఇవ్వడం చాలా ప్రమాదకరం. పాలిచ్చే సమయంలో కెఫెన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానియాలు తీసుకోకపోవడం మంచిది. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

పాలు రావడం లేదని

చాలా మంది తల్లులు పిల్లలకు సరిపడా పాలు రావడం లేదని బాధపడుతుంటారు. కానీ పుట్టిన బిడ్డకు సరిపడా పాలు తల్లి ఇవ్వగలుగుతుంది. తల్లి పాలు బిడ్డకు పూర్తి స్థాయిలో ఇవ్వగలిగితే మళ్లీ ఉత్పత్తి అవుతాయి. చాలా మంది తల్లులు పిల్లలకు సగం పాలు మాత్రమే ఇస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

పుట్టిన అర గంటలోపు బిడ్డకు పట్టే ముర్రు పాలు ఎంతో విశిష్టత కలిగి ఉంటాయి. లేత పసుపు పచ్చ రంగుతో కూడిన పాలను బిడ్డకు ఇవ్వడంతో పసికందు మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు జ్ఞాపక శక్తి పెరిగేందుకు దోహద పడుతుంది. గుండె, చర్మ సంబంధ వ్యాధులు, ఉబ్బసం, ఆస్తమా, బీపీ, షుగర్ రాకుండా చేస్తాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తి పెంపుదలకు దోహదపడతాయి. ఆరు నెలల పాటు రోజు బిడ్డకు 12 సార్లు తాగించాలి. ఈ పాలు తాగిన పిల్లల్లో స్థూలకాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువ.

అధిక పోషకాలు



తల్లిదండ్రులు డబ్బా పాలు కొని తాగించిన బిడ్డకు అమ్మపాలలో ఉన్న పౌష్టికాహారం అందించలేరు. పిల్లలను దృష్టిలో ఉంచుకుని డబ్బా పాలను తయారు చేస్తారు. కానీ తల్లి పాలలోనే పోషకాలుంటాయి. ఆకలితో బిడ్డ ఏడిస్తే డబ్బా పాలు ఇవ్వడంతో పిల్లలు శక్తిని కోల్పోతారు. కచ్చితంగా బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందివ్వాలి.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి

ఇన్‌ఫెక్షన్లు దూరం



దేవుడు సృష్టించిన తల్లి పాలు ఒక టీకా కంటే చాలా గొప్పది. తల్లి పాలు పట్టించడం వల్ల బిడ్డకు వైరల్ ఇన్‌ఫెక్షన్ రాకుండా పనిచేస్తాయి. ఈ పాలల్లో ఎన్నో పోషకాలు, ప్రొటీన్లు ఉంటాయి. తల్లి పాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు దోహదపడుతాయి. తల్లి పాలు బిడ్డ శారీరక, మానసిక ఎదుగదలకు దోహదపడతాయి.

– డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ, షాబాద్

గవర్నర్‌ను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే

చేవెళ్ల: రాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిష్ణుదేవ్ వర్మకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం గవర్నర్‌ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.



నూతన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

గ్రామ భూములు రీసర్వే చేయండి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కేశంపేట: గ్రామ భూములను రీసర్వే చేసి టిప్పాన్(భూనక్ష)ను రైతులకు అందించాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి ప్రస్తావించారు. మండలంలోని చింతకుంటపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న భూములకు నక్ష లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై గ్రామ రైతులు ఇటీవల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలను కలిసి భూనక్ష పైన వినతిపత్రాలను అందించారు. దీంతో బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో శాసనమండలి సభ్యుడు నవీన్‌కుమార్‌రెడ్డి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైన తమ సమస్య పరిష్కారం అవుతుందని గ్రామ రైతులు ఆశతో ఉన్నారు.

ఉచిత విద్య వైద్యం అందించాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న మిరియం వెంకటేశ్వర్లు

నందిగామ: ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పాలక పక్షాలు ప్రతి ఒక్కరికి కూడు, గూడు, గుడ్డతో పాటు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఈదులపల్లి శివారులోని ఓ గార్డెన్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీపీఎం పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పైసా ఉన్నోడికే ప్రైవేటు విద్య, వైద్యం అందుతుందని సామాన్య ప్రజలకు అందని ద్రాక్షలా మారిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చెందిన దేశాలను ఆదర్శంగా తీసుకొని మన దేశంలో సైతం ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు రాజు, చంద్రమోహన్, జగదీష్, యాదయ్య, సామెల్, శోభన్, కవిత, నర్సిరెడ్డి, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, జంగయ్య, శ్రీనునాయక్, ఈశ్వర్, కుర్మయ్య, రాజశేఖర్, పద్మారెడ్డి, గోపాల్, లక్ష్మి, శంకర్, ప్రకాష్, జగన్, చరణ్, శంకరమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు..

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం



శివకుమార్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: తాగుడు మానేయాలని భార్య మందలించిందనే కారణంతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. బుధవారం ఉదయం పట్టాలపై ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు స్టేషన్ మాస్టర్, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు.. మృతుడు వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన నీరటి శివ కుమార్(25)గా గుర్తించారు. ఇతను మద్యానికి బానిసవ్వడంతో భార్య స్వప్న నిత్యం వారించేది. ఈ క్రమంలో ఇరువురికి గొడవలు జరిగేవి. ఈక్రమంలో మనస్తాపానికి గురైన శివకుమార్ షాబాద్‌లో ఉన్న తన సోదరి వద్దకు మంగళవారం వెళ్లాడు. బుధవారం షాద్‌నగర్ ప్లాట్ ఫాం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను ఆదరించాలి

సంస్థ జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్

కొత్తూరు: టీజీ ఆర్టీసీ కార్గో రంగంలో అందిస్తున్న సేవలను వ్యాపారులు, ప్రజలు వినియోగించుకోవాలని ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్ కోరారు. ఇందులో భాగంగా ఆయన కొత్తూరు పట్టణంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో వ్యాపార రంగంతో పాటు స్థానికంగా పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో వస్తు రవాణా ఎక్కువగా ఉంటుందన్నారు. వీటిని ప్రైవేట్ సంస్థల కంటే తక్కువ ఖర్చుతో అనుకున్న సమయంలో టీజీ ఆర్టీసీ కార్గో సరఫరా చేస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్గోలో పరిశ్రమలకు అవసరమైయ్యే టూల్స్ (ఉపకరణాలు), అక్కడ ఉత్పత్తి చేసే వస్తువులు, హాస్టళ్లు, పాఠశాలలకు తిను బండారాలను పంపించేందుకు కూడా సర్వీసులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. వ్యాపారులు, ప్రజలు సహకరిస్తే ఆర్టీసీ రానున్న రోజుల్లో మరిన్ని సేవలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిపో సేల్స్ అధికారి శ్రీనివాస్, నాయకులు సిద్ధార్థరెడ్డి, శ్రీకాంత్, సంస్థ సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్గో సేవల కర పత్రాలను విడుదల చేస్తున్న శ్రీధర్

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన శంకర్ గుండ్ల పోచంపల్లిలోని శివాలయం సమీపంలో నివాసముంటున్నాడు. శంకర్, అతని భార్య ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కుమార్తె సంగీత(18), ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా బుధవారం సంగీత కడుపు నొప్పి వస్తోందని చెప్పి కళాశాలకు వెళ్లకుండా ఇంట్లో ఉండగా భార్యాభర్తలు డ్యూటీకి వెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో చిన్నకుమారుడు భోజనం చేసేందుకు ఇంటికి రాగా సంగీత సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. చుట్టు పక్కల వారి సహాయంతో ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. చదువులో సరిగా రాణించలేకపోతున్నానని తమ కుమార్తె తరచూ బాధ పడేదని, ఈ నేపథ్యంలో ఉరివేసుకుందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య..ఉద్రిక్తత

భర్తే కారకుడంటూ బంధువుల ఆందోళన

లింగోజిగూడ: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని వివాహిత బంధువులు పోలీస్టేషన్ ముందు ఆందోళన చేపట్టడంతో పాటు భర్తపై దాడి చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. యాచారం మండలం కురుమిద్దెకు చెందిన రమావత్ సుజాత(21)కు గతేడాది నల్లగొండ జిల్లా చితంపల్లి మండలం గాశిరాం తాండకు చెందిన రమావత్ శివతో వివాహం జరిగింది. వీరు హయత్‌నగర్ బంజారా కాలనీలో నివాసం ఉంటున్నారు. శివ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఆరునెలల పాప ఉంది. గత కొన్ని రోజులుగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుజాత మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బంధువుల ఆందోళన

కాగా సుజాత ఆత్మహత్య చేసుకోలేదని, శివనే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకకరించారని ఆరోపిస్తూ బుధవారం హయత్‌నగర్ పోలీస్టేషన్ ముందు సుజాత బంధువులు ఆందోళన చేపట్టారు. నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. సుజాత వివాహం సమయంలో ఇచ్చిన కట్నం, బంగారం తిరిగి ఇవ్వాలని శివ బంధువులతో గొడవకు దిగారు. దీంతో పోలీస్టేషన్ ఆవరణలో డబ్బును తిరిగి ఇస్తామని శివ కుటుంబ సభ్యులు ఒప్పందానికి వచ్చారు. ఈ సమయంలో స్టేషన్‌కు వచ్చిన శివపై సుజాత బంధువులు దాడి చేశారు. గమనించిన పోలీసులు వారిని ఆపడానికి ప్రయత్నించగా తోపులాట జరిగింది. ఇద్దరు మహిళా పోలీసులకు స్వల్పంగా గాయాలయ్యాయి. సుజాత బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

బడ్జెట్‌లో దివ్యాంగులను విస్మరించారు

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

షాద్‌నగర్: దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో పెద్దపీట వేయకపోవడం బాధాకరమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో తమకు సరైన నిధులు కేటాయించ లేదన్నారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించినా అవి పక్కదారి పట్టాయని ఆరోపించారు. దీన్ దయాల్ దివ్యాంగుల పునరావాస పథకాన్ని ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని అన్నారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడ దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రస్తావించలేదని అన్నారు. అధికారం చేపట్టిన వెంటనే దివ్యాంగులకు రూ.ఆరు వేల పెన్షన్ అందిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాజు, శేఖర్‌గౌడ్, నాగార్జున, శ్రీనివాస్, సంతోష, మనీలా, నర్సింలుగౌడ్, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

సారా తయారీ సామగ్రి విక్రయిస్తే చర్యలు



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న సీఐ బద్యానాథ్‌చౌహాన్

ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్

- నాటు సారా మహమ్మారి నిర్మూలనకు సహకరించాలని సూచన

ఆమనగల్లు: నాటుసారా తయారీకి ఉపయోగించే వస్తువులను వ్యాపారస్తులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ హెచ్చరించారు. సారా రహిత రాష్ట్రంగా నిలపడానికి వ్యాపారస్తులు సహకరించాలని ఆయన కోరారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం ఆమనగల్లు పట్టణ కిరాణాషాపుల యజమానులు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐ బద్యానాథ్‌చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గిరిజన తండాలలో నాటుసారా తయారీ కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. నాటుసారా తయారికి ఉపయోగించే నల్లబెల్లం, పటిక, ఇప్పపువ్వు తదితర వస్తువులను విక్రయించరాదని సూచించారు. నాటుసారా తయారీ వస్తువులను విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి రామ్మోహన్, సభ్యులు లక్ష్మయ్య, సురేష్, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.